# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో ప్రతి పౌరునికీ సామాజిక న్యాయం అందించడమే వికసిత భారత్ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో నూతన టెక్స్‌టైల్ విధానంతో 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **తెలంగాణలో విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

4. **ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమవుతారు.**

5. **బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**

==========================

దేశంలో ప్రతి పౌరునికీ సామాజిక న్యాయంతో పాటు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడమే వికసిత భారత్ లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. సుప్రీం కోర్టులో గత సాయంత్రం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కోట్ల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు తెరిచిందని చెప్పారు. సామాజిక సమానత్వం సాధించాలని రాజ్యాంగం ప్రవచిస్తోందని, రాజ్యాంగం భవిష్యత్తుకు మార్గదర్శి వంటిదని ప్రధాన మంత్రి పేర్కొంటూ ...

వాయిస్ (30 సెకన్లు)

-------------------------

పెట్టుబడుల ద్వారా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నూతన టెక్స్ టైల్ విధానంపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులే లక్ష్యంగా నూతన టెక్స్ టైల్ విదానానికి రూపకల్పన చేశామని, దీని ద్వారా 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు

కల్పించవచ్చని చేప్పారు. ఈ రంగంలో వచ్చే పెట్టుబడుల ద్వారా గ్రామ స్థాయిలో మహిళలకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు. కొత్త పాలసీలో వస్త్రాల తయారీ రంగానికి అనేక ప్రోత్సాహకాలను అందిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఢిల్లీలో పర్యటిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో నిన్న సమావేశమయ్యారు. రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చర్చించారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమవుతారు. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా జలజీవన్ మిషన్ అమలులో రాష్ట్రానికి రావాల్సి నిధులు, ఆ పథకం కాలపరిమితిని పొడిగించాల్సిన అంశాలపై ప్రధానమంత్రితో చర్చిస్తారని అధికారులు తెలిపారు. అలాగే కేంద్ర పర్యావరణ, అటవీశాఖమంత్రి భూపేందర్ యాదవ్‌తోనూ పవన్‌కల్యాణ్ సమావేశంకానున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో రాజ్యసభ ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, ఒడిశా, పశ్చిమ బెంగాల్, హర్యానా రాష్ట్రాల్లో ఒక్కో స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల స్వీకరణకు వచ్చే నెల 10వ తేదీని తుది గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించింది. డిసెంబర్ 20న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్.. అదే రోజు 5 గంటల నుంచి లెక్కింపు ఉంటుందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్య రాజీనామాలు చేయడంతో ఉపఎన్నికలు జరగనున్నాయి.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా సౌర ఫలకాలు ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వం రాయితీ అందిస్తుందని చెప్పారు. సూర్యఘర్ పథకం విద్యుత్ బిల్లును తగ్గించడమే కాక. మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.

కాగా.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తావిభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారిందని ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ బలపడి తుపానుగా మారిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. శ్రీలంక తమిళనాడు మధ్య తీరం దాటే అవకాశం ఉందని దీని ప్రభావంతో రానున్న 4 రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రానున్న 24 గంటల్లో అన్నమయ్య, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీరం వెంబడి గంటకు 45 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. రాష్ట్రంలోని అన్ని నౌకాశ్రయాల్లో అధికారులు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

అలాగే తుపాను ప్రభావం తెలంగాణపై ఉండదని.. అక్కడక్కడ.. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకూ రైతుల నుంచి నాలుగు లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పునాదిపాడు, కోలవెన్ను రైతు సేవా కేంద్రాలను మంత్రి అధికారులతో కలిసి గత రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ,

..వాయిస్. 25 సెకన్లు

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమల వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక రైళ్ళను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు వచ్చే నెల 1 వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 27 వరకు పలు తేదీల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం హైదరాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి కొల్లం, కొట్టాయంలకు 44 ప్రత్యేక రైళ్లు సేవలు అందించనున్నాయి, వీటిలో విశాఖపట్నం – కొల్లం– విశాఖ ప్రత్యేక రైళ్లు డిసెంబర్ 4 నుంచి ఫిబ్రవరి 27 వరకు సేవలు అందించనున్నాయి. విశాఖ – కొల్లం ప్రత్యేక రైలు ప్రతి బుధవారం ఉదయం 8 గంటల 20 నిమిషాలకు విశాఖలో బయల్దేరి గురువారం మధ్యాహ్నం 12 గంటల 55 నిమిషాలకు కొల్లం చేరుకుంటుంది. కొల్లం – విశాఖ రైలు డిసెంబర్ 5 నుంచి ఫిబ్రవరి 27 వరకు ప్రతి గురువారం కొల్లంలో రాత్రి 7 గంటల 35 నిమిషాలకు బయల్దేరి శుక్రవారం రాత్రి 11 గంటల 20 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

=====================